https://trinetnews.com/

# ట్రైనెట్ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

## తాజా తెలుగు వార్తలు

ప్రతి 3 గంటలకు

98497 67747 | 9494184136

10 AM TO 1 PM

సంపుటి: 01 | సంచిక:28 | పేజీలు :02 | వేల:2/రూ | ఎడిటర్: వెంకటేశ్వర్లు రాపోలు | ఆదివారం, సెప్టెంబర్ 13,2026



### వినాయక చవితి వేళ...
## పురాణపండ 'గౌరీపుత్ర' సందడి

- పురాణపండ శ్రీనివాస్ 'గౌరీపుత్ర నమస్తేస్తు' గ్రంథం
- ఈ పుస్తకానికి భక్తుల నుంచి భారీ స్పందన
- వ్రతకల్పం, స్తోత్ర వ్యాఖ్యానాలతో ఆకట్టుకుంటున్న కంటెంట్
- అందమైన చిత్రాలు, నాణ్యమైన ముద్రణతో ప్రత్యేక రూపకల్పన
- వేల సంఖ్యలో భక్తుల చేతుల్లో కనిపిస్తున్న ఆధ్యాత్మిక గ్రంథం

**ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు13**

ప్రముఖ ఆధ్యాత్మిక రచయిత, జ్ఞాన మహాయజ్ఞకేంద్రం వ్యవస్థాపకులు పురాణపండ శ్రీనివాస్ రచించిన 'గౌరీపుత్ర నమస్తేస్తు' అనే గ్రంథం గణేశ నవరాత్రుల సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. హైదరాబాద్, విశాఖపట్నం, విజయ వాడ, గుంటూరు సహా పలు ప్రధాన నగరాల్లో ఈ పుస్తకానికి భక్తుల నుంచి అపూర్వ స్పందన లభిస్తోంది.

02



## సైమా అవార్డ్స్ ఫంక్షన్ లో మల్లారెడ్డి కోడలు

- సందడి మామూలుగా లేదు..
- ఓ రేంజిలో స్టయిలింగ్! బెంగళూరు సైమా వేడుకల్లో ప్రత్యేక
- ఆకర్షణగా నిలిచిన ప్రీతి రెడ్డి మాజీ మంత్రి మల్లారెడ్డి కోడలుగా అందరి దృష్టిని ఆకర్షించిన వైనం
- స్టార్ హీరోయిన్లకు దీటుగా డిజైనర్ దుస్తులతో రెడ్ కార్పెట్‌పై హొయలు
- ఆమె గ్లామరస్ లుక్‌పై సోషల్ మీడియాలో విస్తృత చర్చ

**ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు13**

బెంగళూరులో సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్ (సైమా) వేడుకలో ఓ ఊహించని అతిథి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. టాలీవుడ్, కోలీవుడ్ తారల తళుకుబెళుకుల మధ్య, రాజకీయ, వ్యాపార ప్రముఖుల హడావుడిలో తెలంగాణ మాజీ మంత్రి, సీనియర్ బీఆర్ఎస్ నేత చామకూర మల్లారెడ్డి కోడలు ప్రీతి రెడ్డి సెంటరాఫ్ అట్రాక్షన్‌గా మారారు.

02




## సారీ చెప్పి ఉంటే కొండా సురేఖ పదవి నిలిచేది : కొండా మురళి

- కొండా సురేఖ మంత్రి పదవి కోల్పోయాక తొలిసారి స్పందించిన కొండా మురళి
- పదవి కోసం క్షమాపణ చెప్పేది లేదని సురేఖ తేల్చిచెప్పారని వెల్లడి
- కాంగ్రెస్‌ను వీడే ప్రసక్తే లేదు, రాహుల్ గాంధీనే తమ నాయకుడన్న మురళి
- వచ్చే ఎన్నికల్లో గెలిచే గుర్రాలకు తామే టికెట్లు ఇస్తామని సంచలన ప్రకటన
- తన శరీరంలో నాలుగు బుల్లెట్లు ఉన్నా బతికే ఉన్నానని వ్యాఖ్య

**ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు13**

తెలంగాణ మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించిన తర్వాత ఆమె భర్త, కాంగ్రెస్ సీనియర్ నేత కొండా మురళి తొలిసారిగా స్పందించారు. వరంగల్‌లో కాంగ్రెస్ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తాము పార్టీ మారుతున్నా మంటూ వస్తున్న ఊహాగానాలకు తెరదించారు.

02




## సముద్ర గర్భంలో భారీగా బంగారం, వెండి నిక్షేపాలు.. కనిపెట్టిన చైనా..!

**ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు13**

చైనా శాస్త్రవేత్తలు సముద్రగర్భంలో ఓ భారీ ఖనిజ నిధిని కనుగొన్నారు. పశ్చిమ పసిఫిక్ మహాసముద్రంలో చేపట్టిన పరిశోధనల్లో అత్యంత విలువైన బంగారం , వెండి నిక్షేపాలు పెద్ద మొత్తంలో ఉన్నట్లు గుర్తించారు. భూమిపై లభించే గనులతో పోలిస్తే ఇక్కడ బంగారం, వెండి నిల్వలు గణనీయంగా అధిక స్థాయిలో ఉండటం విశేషం. సింఘువా యూనివర్సిటీ , షాంఘై జియావో టాంగ్ యూనివర్సిటీ సహా పలు సంస్థల పరిశోధకులు 'జియాంగ్ యాంగ్ హాంగ్ 10' అనే నౌకలో ఈ యాత్రను చేపట్టారు. సేకరించిన నమూనాలను నౌకలోని ల్యాబ్‌లోనే విశ్లేషించగా ఆశ్చర్యపరిచే ఫలితాలు వచ్చాయి. ఇక్కడి ఖనిజాల్లో ప్రతి టన్నుకు 15.4 గ్రాముల వరకు బంగారం, 1,271 గ్రాముల వరకు వెండి ఉన్నట్లు తేలింది. ఈ నిక్షేపాలు చైనా ప్రత్యేక ఆర్థిక మండలి పరిధిలోని సముద్ర భాగంలో ఉన్నాయి. సముద్ర అంతర్భాగంలో 700 నుంచి 1,500 మీటర్ల లోతులో ఈ హైడ్రోథర్మల్ క్షేత్రం ఉంది.

02




### నియోజకవర్గాల వారీగా
## 'మూడ్ ఆఫ్ తెలంగాణ'
### సంచలన సర్వే రిపోర్టు! రేవంత్ పాలనపై జనం మూడ్ ఇదే..

**ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు13**

కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై అసంతృప్తి.. హామీల అమలులో విఫలంపై ఆగ్రహం.. రాజకీయ విధానాలపై పెదవి విరుపు.. ప్రతిపక్ష నేతలపై అధికార పార్టీ నేతల వ్యాఖ్యలపై తీవ్ర వ్యతిరేకత.. కేసీఆర్ నివాసంపై దాడి యత్నంపై ఆగ్రహం.. ఇదీ 'మూడ్ ఆఫ్ తెలంగాణ' సర్వేలో రాష్ట్రవ్యాప్తంగా కనిపించిన ప్రజల మూడ్. అయితే.. రాష్ట్రస్థాయిలో వెల్లడైన ఈ అభిప్రాయాలు కొన్ని ప్రాంతాలకే పరిమితమా? లేక తెలంగాణ అంతటా ఇదే పరిస్థితి ఉందా? అన్న ప్రశ్నలకు ఇప్పుడు నియోజకవర్గాల వారీగా వచ్చిన తాజా రిపోర్టు సమాధానం చెప్తున్నది. ఒక్కటి కాదు.. రెండు కాదు.. రాష్ట్రంలోని దాదాపు అన్ని నియోజకవర్గాల్లోనూ ప్రజల నాడి ఒకే రకంగా కనిపించింది. అధికార కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్న ప్రాంతాల్లోనూ, ప్రతిపక్ష బీఆర్ఎస్ బలంగా ఉన్న చోట్లనూ, హైదరాబాద్‌లోనూ, గ్రామీణ ప్రాంతాల్లోనూ ప్రస్తుత పాలనపై అసంతృప్తి వ్యక్తమైనట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన తాజా రిపోర్టులో 118 నియోజకవర్గాల్లో శాంపిళ్లు నమోదయ్యాయి. మొత్తం 29,476 మంది అభిప్రాయాలను సేకరించారు. ఇందులో ఐదు ప్రశ్నలపై ప్రజల స్పందనను నమోదు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలన తీరు ఎలా ఉంది? ఎన్నికల హామీలు అమలు చేశారా? ముఖ్యమంత్రి అనుసరిస్తున్న రాజకీయ విధానాలపై అభిప్రాయం ఏమిటి? కాంగ్రెస్ నాయకులు కేసీఆర్ మరణాన్ని కోరుకోవడంపై ప్రజల స్పందన ఏమిటి? కేసీఆర్-బీఆర్ఎస్ పాలన, రేవంత్‌రెడ్డి-కాంగ్రెస్ పాలనలో ఏది బాగుంది?

02

# వినాయకుడి రూపంలోనే మనకు ఎన్నో సందేశాలు : హరీశ్ రావు




**సిద్దిపేట జిల్లా,ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు13**

విఘ్నేశ్వరుడు దేవుడే కాకుండా ప్రజలందరికీ మార్గదర్శకుడని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. అమర్నాథ్ అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం సిద్దిపేట పట్టణంలోని వెంకటేశ్వర ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వినాయక విగ్రహాన్ని ఎంత పెద్దగా పెట్టామన్నది ముఖ్యం కాదని.. ఎంత భక్తిశ్రద్ధలతో పూజించామన్నదే ముఖ్యమన్నారు. ఊరికి ఒక మట్టి విగ్రహాన్ని ఏర్పాటుచేసి పూజించాలని తాను గతంలో చెప్పానని గుర్తు చేశారు. ఏ గ్రామంలోనైనా, వార్డులోనైనా ఒక్కటే ఒక మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుంటే తాను పర్మినెంట్ షెడ్డు నిర్మించి ఇస్తానని పిలుపునిచ్చారు...రసాయనాలతో కూడిన వినాయకులను చెరువులో నిమజ్జనం చేయడంతో నీళ్లలో ఉండే జీవరాశులు చనిపోవడంతోపాటు భూమి కలుషితమై ప్రజా ఆరోగ్యానికి కీడు చేసే క్యాన్సర్ లాంటి ప్రమాదకరమైన వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు... వినాయకుడి రూపంలోనే మనకు ఎన్నో సందేశాలు ఉన్నాయి. ఆయన పెద్ద తల గొప్పగా ఆలోచించమని చెబుతుంది... పెద్ద చెవులు ప్రజల మాట వినాలని చెబుతాయి... చిన్న కళ్లు లక్ష్యంపై దృష్టి పెట్టాలని చెబుతాయి. ఆయన తొండం పరిస్థితులకు అనుగుణంగా ముందుకు సాగాలని నేర్పుతుంది. అందుకే గణపతి కేవలం పూజించే దేవుడు మాత్రమే కాదు... మన జీవితానికి మార్గదర్శకుడన్నారు..ప్రకృతిని ప్రేమించి, పుష్పాలను ప్రేమించే గొప్ప సంస్కృతి మన తెలంగాణ వారిదన్నారు. దక్షిణ భారతదేశంలోనే అమర్నాథ్ అన్నా సేవ సమితి ప్రసిద్ధిగాంచిందన్నారు. అమర్నాథ్ అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో 16 సంవత్సరాలుగా మంచు కొండల్లో సేవలందించడం గొప్ప విషయమన్నారు. అలాగే ప్రకృతిని ప్రేమిస్తూ 16 సంవత్సరాలుగా సిద్దిపేటలో ప్రతి సంవత్సరం 10 వేల మట్టి విగ్రహాలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. మనం ఏ కార్యక్రమం చేపట్టిన ముందు విఘ్నేశ్వరుని పూజించే చేపడుతామని ఆ విఘ్నేశ్వరుడి ఆశీర్వాదంతో ప్రజలందరూ ఆరోగ్యంగా సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నానారు.ప్రపంచ పటాలు పరిశీలించండి

### విఘ్నేశ్వరుడి దయతో విఘ్నాలు తొలగాలి..

వినాయక చవితి పర్వదినం సందర్భంగా హరీశ్ రావు ప్రజలందరికి వినాయకచవితి పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పర్వదినాన్ని ప్రజలంతా కుటుంబసమేతంగా భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలి. సకల కార్యాలకు ప్రథమ పూజ చేసేది, పూజించేది విఘ్నేశ్వరుడినే... ఆ దేవుడి అనుగ్రహంతో విఘ్నాలు తొలిగి అన్నింటా శుభం చేకూరాలన్నారు. నిర్విఘ్నంగా అన్ని కార్యాలు నెరవేరాలి.. ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ప్రార్థిస్తున్నానని చెప్పారు.. మట్టి గణపతి ప్రతిమను పూజించాలి 'మట్టి గణపతే మహా గణపతి అని అన్నారు.

# మంత్రి పదవి పోయిందన్న బాధ లేదు



- తాను కాంగ్రెస్ పార్టీని వీడుతున్నానన్న ప్రచారాన్ని కొట్టిపారేసిన కొండా సురేఖ
- మంత్రి పదవి పోయినందుకు బాధ లేదు, కానీ కారణం చెప్పకపోవడమే ఆవేదన కలిగించింది
- భవిష్యత్తులోనూ కాంగ్రెస్ టికెట్‌పైనే పోటీ చేస్తామని స్పష్టం చేసిన కొండా దంపతులు
- స్థానిక నేతలపై పరోక్షంగా విమర్శలు గుప్పించిన మాజీ మంత్రి
- త్వరలో తన భర్త కొండా మురళికి పదవి వస్తుందన్న సంకేతాలు ఉన్నాయని వెల్లడి

**ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు13**

తాను కాంగ్రెస్ పార్టీని వీడుతున్నట్టుగా కొన్ని రోజులుగా జరుగుతున్న ప్రచారానికి మాజీ మంత్రి, కాంగ్రెస్ ఎమ్మెల్యే కొండా సురేఖ ఫుల్ స్టాప్ పెట్టారు. ఆ వార్తలన్నీ నిరాధారమైనవని, కేవలం కల్పిత కథనాలని ఆమె కొట్టిపారేశారు. తన భర్త కొండా మురళితో కలిసి ఆదివారం వరంగల్‌లో పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్‌ను వీడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు."మేము కాంగ్రెస్‌లోనే పుట్టాం, కాంగ్రెస్‌లోనే పెరిగాం. మాకు వేరే పార్టీలోకి వెళ్లాలనే ఆలోచన లేదు" అని కొండా సురేఖ తేల్చిచెప్పారు. గతంలో కొన్ని తప్పనిసరి పరిస్థితుల్లో బీఆర్ఎస్‌లోకి వెళ్లాల్సి వచ్చిందని అన్నారు. తమను ఎవరూ బయటకు పంపలేదని గుర్తుచేశారు. భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికల్లోనూ కాంగ్రెస్ టికెట్‌పైనే పోటీ చేస్తామని ఆమె ధీమా వ్యక్తం చేశారు. మంత్రివర్గం నుంచి తనను తొలగించడంపై మాట్లాడుతూ.. పదవి పోయినందుకు వ్యక్తిగతంగా ఎలాంటి బాధ లేదని, కానీ ఎందుకు తొలగించారో కారణం చెప్పకపోవడం ఆవేదన కలిగించిందని అన్నారు. మంత్రి పదవి ఒక అలంకారం మాత్రమేనని, తనకు అప్పగించిన మూడు శాఖలను ఎలాంటి అవినీతికి తావులేకుండా నడిపించానని తెలిపారు.పార్టీ మార్పు ప్రచారం నేపథ్యంలో అధిష్ఠానం నుంచి తనకు ఫోన్లు వచ్చాయని, తాను పార్టీ వీడటం లేదని వారికి స్పష్టం చేశానని సురేఖ వెల్లడించారు. ఈ క్రమంలో తన భర్త కొండా మురళికి త్వరలో పదవి ఇస్తామనే సంకేతాలు కూడా అధిష్ఠానం నుంచి వచ్చాయని ఆమె తెలిపారు. రానున్న ఎన్నికల్లో వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరపున మళ్లీ గెలిచి, మంత్రిగా తిరిగి వస్తానని విశ్వాసం వ్యక్తం చేశారు. త్వరలో జరగనున్న వరంగల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 24 నుంచి 25 డివిజన్లలో కాంగ్రెస్‌ను గెలిపించడమే తమ లక్ష్యమని ప్రకటించారు.ఈ సందర్భంగా స్థానిక నేతలపై ఆమె పరోక్షంగా విమర్శలు గుప్పించారు. కనీసం కార్పొరేటర్‌గా కూడా గెలవలేని వారు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. వైఎస్ఆర్ మరణం తర్వాత స్థానికంగా ఉన్న కొందరు "గుంటనక్కలు" తమను మోసం చేశారని ఆరోపించారు. అప్పటి మంత్రిని ఓడించేందుకే కేసీఆర్ తనకు వరంగల్ తూర్పు టికెట్ ఇచ్చారని గుర్తుచేశారు.

మొదటిపేజీ తరువాయి

## వినాయక చవితి వేళ...

# పురాణపండ 'గౌరీపుత్ర' సందడి

ఈ గ్రంథంలో శ్రీ వరసిద్ధి వినాయక వ్రతకల్పంతో పాటు ఆదిశంకరాచార్యులు, ప్రాచీన రుషులు రచించిన ముఖ్యమైన స్తోత్రాలు ఉన్నాయి. వీటికి పురాణపండ శ్రీనివాస్ అందించిన వ్యాఖ్యానం సరళమైన, సౌందర్యవంతమైన భాషలో ఉండటంతో పాఠకులను ఎంతగానో ఆకట్టుకుంటోందని ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. అరుదైన గణపతి వర్ణ చిత్రాలు, ఆకర్షణీయమైన డిజైన్‌తో పుస్తకం ప్రత్యేకంగా నిలుస్తోంది. తెలంగాణ సచివాలయంలోని పలువురు అధికారులు సైతం పుస్తక రూపకల్పన, కంటెంట్‌ను మెచ్చుకుంటున్నారు.ఏ ఫోర్ సైజులో, జపాన్ ఆర్ట్ పేపర్‌పై డిజిటల్ ప్రింటింగ్‌తో అత్యంత నాణ్యంగా ముద్రించిన ఈ పుస్తకం వేల సంఖ్యలో భక్తులకు చేరువైంది. హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ బడా గణేశ్ మండపంతో పాటు కూకట్‌పల్లి, మణికొండ, గచ్చిబౌలి వంటి ప్రాంతాలు, పలు ప్రముఖ కాలనీలలో భక్తుల చేతుల్లో ఈ గ్రంథం కనిపిస్తోంది.కిమ్స్ హాస్పిటల్స్ ఛైర్మన్ బొల్లినేని కృష్ణయ్య, వారాహి చలనచిత్రం అధినేత సాయి కొర్రపాటి వంటి ప్రముఖుల సహకారంతో ఈ పుస్తకాన్ని భక్తులకు అందిస్తున్నారు. దాదాపు 100 పేజీలతో, మంత్ర, తంత్ర, యంత్రాత్మక విశేషాలతో కూడిన ఈ గ్రంథాన్ని ఒక "మంగళ మంత్ర పేటిక"గా తీర్చిదిద్దారు. రచయితగా పురాణపండ శ్రీనివాస్ శైలికి లక్షలాది మంది అభిమానులు ఉన్నారని, వారందరికీ ఈ గణపతి నవరాత్రుల వేళ 'గౌరీపుత్ర నమస్తేస్తు' ఒక అక్షర కానుకగా నిలిచిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

మొదటిపేజీ తరువాయి

# సైమా అవార్డ్స్ ఫంక్షన్ లో మల్లారెడ్డి కోడలు

సినీ పరిశ్రమతో నేరుగా ఎలాంటి సంబంధం లేకపోయినా, ఆమె ఈవెంట్‌లో అందరి దృష్టినీ తనవైపు తిప్పుకున్నారు.హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని మల్లారెడ్డి విద్యాసంస్థల్లో తరచూ సినిమా ఈవెంట్లు, షూటింగ్‌లు జరుగుతుంటాయి. ఈ నేపథ్యంలోనే సైమా నిర్వాహకులు ప్రీతి రెడ్డిని ఈ వేడుకకు ప్రత్యేకంగా ఆహ్వానించినట్లు సమాచారం. ఈవెంట్‌కు హాజరైన ప్రీతి రెడ్డి.. ఖరీదైన డిజైనర్ దుస్తుల్లో, స్టార్ హీరోయిన్లకు ఏమాత్రం తీసిపోని గ్లామర్‌తో రెడ్ కార్పెట్‌పై నడిచారు. ఆమె హొయలు, కెమెరాలకు ఇచ్చిన ఫోజులు చూసి అక్కడున్న వారంతా ఆశ్చర్యపోయారు. ఫోటోగ్రాఫర్లు, సోషల్ మీడియా ప్రతినిధులు ఆమెను తమ కెమెరాల్లో బంధించేందుకు పోటీపడ్డారు.ప్రీతి రెడ్డి గ్లామరస్ లుక్‌పై ప్రస్తుతం సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఒక రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన మహిళ, ఫ్యాషన్ ప్రపంచంలో ఇంతటి సంచలనం సృష్టించడంపై సినీ వర్గాలు కూడా ఇటువైపు దృష్టి సారించాయి. మొత్తానికి, ప్రీతి రెడ్డి సైమా ఎంట్రీ ఊహించని విధంగా ఓ ఫ్యాషన్ స్టేట్‌మెంట్‌గా నిలిచిపోయింది.

మొదటిపేజీ తరువాయి

# సారీ చెప్పి ఉంటే కొండా సురేఖ పదవి నిలిచేది

పదవి కోసం ఆత్మగౌరవాన్ని వదులుకోబోమని, కాంగ్రెస్‌ను వీడే ప్రసక్తే లేదని ఆయన తేల్చిచెప్పారు."ఒక్కసారి సారీ చెబితే చాలని నాయకులు సురేఖతో అన్నారు. కానీ, పదవి ఉంటే ఉండనీ, పోతే పోనీ, క్షమాపణ మాత్రం చెప్పనని సురేఖ కరాఖండిగా చెప్పింది" అని మురళి ఆనాటి పరిణామాలను వివరించారు. పదవులు ఈరోజు వచ్చి రేపు పోతాయని, కానీ కృతజ్ఞత తమ రక్తంలో, కుటుంబంలో ఉందని ఆయన వ్యాఖ్యానించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటామని, తమ విధేయత కాంగ్రెస్ పార్టీకేనని స్పష్టం చేశారు.రాహుల్ గాంధీ వల్లే సురేఖకు ఎమ్మెల్యేగా గెలిచే అవకాశం వచ్చిందని, ఆయన్ను ప్రధానిని చేయడమే తమ లక్ష్యమని కొండా మురళి ప్రకటించారు. "వచ్చే ఎన్నికల్లో గెలుపు గుర్రాలకు మేమే టికెట్లు ఇస్తాం" అంటూ వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి, మహేశ్ గౌడ్ వంటి నేతలు కూడా ఎన్నో పోరాటాలు చేసి పైకి వచ్చారని గుర్తుచేశారు. త్వరలో జరగనున్న కార్పొరేషన్ ఎన్నికల్లో చురుగ్గా పాల్గొంటామని తెలిపారు.ఈ సందర్భంగా కొండా మురళి భావోద్వేగానికి గురయ్యారు. "నా శరీరంలో నాలుగు బుల్లెట్లు ఉన్నాయి, అయినా ఇంకా బతికే ఉన్నాను" అని అన్నారు. తానూ, సురేఖ ఒకే మాటపై ఉంటామని, అయితే తమ కుమార్తె రాజకీయ భవిష్యత్తు ఆమె ఇష్టమని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలతో కొండా దంపతులు కాంగ్రెస్‌లోనే కొనసాగుతారని స్పష్టత వచ్చినట్లయింది.

మొదటిపేజీ తరువాయి

# సముద్ర గర్భంలో భారీగా బంగారం, వెండి నిక్షేపాలు.. కనిపెట్టిన చైనా..!

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు13

ఇక్కడ సముద్రపు నీటి ఉష్ణోగ్రత 315 డిగ్రీల సెల్సియస్‌కు పైగా ఉన్నట్లు గుర్తించారు.మూడు పెద్ద శంఖాకార నిర్మాణాలతో ఉన్న ఈ ఖనిజ క్షేత్రం భవిష్యత్తులో ప్రపంచస్థాయి సముద్రగర్భ నిక్షేపంగా మారే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. బంగారం, వెండితోపాటు రాగి, ఇనుము, జింక్ వంటి ఇతర కీలక ఖనిజాలు కూడా ఇక్కడ పుష్కలంగా ఉన్నాయి. ఈ నిక్షేపాల పూర్తిస్థాయి పరిమాణం, ఆర్థిక ప్రయోజనాలను అంచనా వేయడానికి 2027లో మరింత కచ్చితత్వంతో కూడిన సర్వేలు చేపట్టాలని చైనా యోచిస్తోంది.అయితే ఇంత లోతులో ఉన్న హైడ్రోథర్మల్ క్షేత్రాల నుంచి ఖనిజాలను వెలికితీయడం సాంకేతికంగా చాలా సంక్లిష్టమైన ప్రక్రియ. ప్రస్తుతం ఇలాంటి మైనింగ్ కార్యకలాపాలు ప్రపంచంలో ఎక్కడా జరగడం లేదు.

# గోవా వెళ్లి అశోక్ గజపతిరాజు ఆశీస్సులు అందుకున్న చిన్న శ్రీను

గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజుతో టీడీపీ నేత చిన్న శ్రీను భేటీ

కుమార్తె సిరి సహస్రతో కలిసి ఆశీస్సులు అందుకున్న వైనం

చంద్రబాబు, లోకేశ్, అశోక్ గజపతి రాజు సూచనలు పాటిస్తానన్న చిన్న శ్రీను

వైసీపీ నుంచి ఇటీవల టీడీపీలో చేరిన బొత్స మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావు



ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు13

ఇటీవల తెలుగుదేశం పార్టీలో చేరిన మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజుతో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. గోవాలో జరిగిన ఈ భేటీలో ఆయన కుమార్తె సిరి సహస్ర కూడా ఉన్నారు.గోవాలోని గవర్నర్ నివాసంలో జరిగిన ఈ సమావేశంలో అశోక్ గజపతిరాజు.. చిన్న శ్రీనుకు, ఆయన కుమార్తెకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ ఎమ్మెల్యే అదితి గజపతిరాజు కూడా వారితో పాటు ఉండి, చిన్న శ్రీను కుటుంబానికి ఆతిథ్యం ఇచ్చారు.సమావేశం అనంతరం చిన్న శ్రీను మాట్లాడుతూ.. టీడీపీ అధినేత చంద్రబాబు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ ఆదేశాలను, అలాగే అశోక్ గజపతిరాజు వంటి పెద్దల సూచనలను తాను తు.చ. తప్పకుండా పాటిస్తానని స్పష్టం చేశారు. కేవలం ఆయన ఆశీస్సులు, మార్గనిర్దేశం కోసమే ప్రత్యేకంగా కలిసినట్లు వివరించారు.కాగా, వైసీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణకు మేనల్లుడైన చిన్న శ్రీను, ఇటీవల వైసీపీకి రాజీనామా చేసి తన కుమార్తె సిరి సహస్రతో కలిసి టీడీపీలో చేరిన విషయం తెలిసిందే. ఉండవల్లిలో చంద్రబాబు వారికి పార్టీ కండువా కప్పి టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ నేపథ్యంలో విజయనగరం జిల్లాకు చెందిన సీనియర్ నేత అశోక్ గజపతి రాజుతో చిన్న శ్రీను భేటీకి రాజకీయంగా ప్రాధాన్యం ఏర్పడింది.

# శ్రీవారి బ్రహ్మోత్సవాలకు హైటెక్ భద్రత..

## తొలిసారిగా సరికొత్త టెక్నాలజీల వినియోగం



శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు

కమ్యూనికేషన్ కోసం తొలిసారిగా జియో నెట్‌వర్క్ స్లైసింగ్ టెక్నాలజీ

గ్యాలరీల్లో రద్దీని అంచనా వేసేందుకు 200 ఏఐ ఆధారిత కెమెరాలు

5,300 మంది సిబ్బంది, 3 వేల కెమెరాలతో నిరంతర నిఘా

తోపులాటల నివారణకు దిశల వారీగా ప్రత్యేక ఎగ్జిట్ ప్లాన్ అమలు

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు13

తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు టీటీడీ ఈసారి భద్రత విషయంలో సాంకేతికతకు పెద్దపీట వేస్తోంది. లక్షలాదిగా తరలివచ్చే భక్తుల రద్దీని సమర్థంగా నియంత్రించడం, అత్యవసర సమయాల్లో కమ్యూనికేషన్‌కు ఎలాంటి అంతరాయం లేకుండా చూడటం లక్ష్యంగా అధునాతన టెక్నాలజీలను ప్రవేశపెడుతోంది. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత కెమెరాలు, నెట్‌వర్క్ స్లైసింగ్ వంటి టెక్నాలజీలతో భద్రతా వ్యవస్థను మరింత పటిష్ఠం చేస్తోంది.

**తొలిసారిగా నెట్‌వర్క్ స్లైసింగ్ టెక్నాలజీ**

గరుడ సేవ వంటి ప్రధాన ఘట్టాల సమయంలో మాడ వీధులకు సుమారు 3.5 లక్షల మంది భక్తులు వస్తారని టీటీడీ అంచనా వేస్తోంది. ఇంత భారీ రద్దీ ఉన్నప్పుడు సాధారణ మొబైల్ నెట్‌వర్క్‌లు పనిచేయకపోవడం, వాకీటాకీల ఫ్రీక్వెన్సీలు ఓవర్‌ల్యాప్ కావడం వంటి సమస్యలు తలెత్తుతాయి. దీనిని అధిగమించేందుకు జియోతో కలిసి ప్రయోగాత్మకంగా 'నెట్‌వర్క్ వితిన్ ది నెట్‌వర్క్' పేరుతో నెట్‌వర్క్ స్లైసింగ్ టెక్నాలజీని అమలు చేస్తోంది. దీని కింద 30 అధునాతన కమ్యూనికేషన్ పరికరాలను ఏర్పాటు చేశారు. సాధారణ సిగ్నల్స్ జామ్ అయినా, ఈ పరికరాలు కమాండ్ కంట్రోల్ రూమ్‌తో అనుసంధానమై పనిచేస్తాయి. 11 కీలక సబ్-కంట్రోల్ పాయింట్ల వద్ద ఉన్నతాధికారులకు వీటిని అందించనున్నారు.

**రద్దీని అంచనా వేయనున్న ఏఐ కెమెరాలు**

గ్యాలరీల్లో భక్తుల రద్దీని కచ్చితంగా అంచనా వేసేందుకు ఈసారి తొలిసారిగా ఏఐ, సాఫ్ట్‌వేర్ ఆధారిత హెడ్ కౌంటింగ్ కెమెరాలను వినియోగిస్తున్నారు. ఇందుకోసం దాదాపు 200 కెమెరాలను ఏర్పాటు చేశారు. గ్యాలరీలను గ్రిడ్లుగా విభజించి, ప్రతి గ్రిడ్‌లో ఉన్న భక్తుల సంఖ్యను ఈ కెమెరాలు రియల్ టైంలో లెక్కిస్తాయి. ఏదైనా గ్యాలరీ సామర్థ్యానికి మించి నిండిపోతే, వెంటనే అప్రమత్తమై భక్తులను ప్రత్యామ్నాయ మార్గాల్లోకి మళ్లించేందుకు ఇది దోహదపడుతుంది.

**తోపులాటల నివారణకు కొత్త ఎగ్జిట్ ప్లాన్**

గ్యాలరీల నుంచి భక్తులు ఒకేసారి బయటకు వచ్చే సమయంలో తోపులాటలు జరగకుండా ఈసారి దిశల వారీగా కొత్త ఎగ్జిట్ ప్లాన్‌ను అమలు చేస్తున్నారు. ఏ మాడ వీధిలో ఉన్న భక్తులు అదే దిశలో బయటకు వెళ్లేలా మార్గాలను నిర్దేశించారు. దక్షిణ మాడ వీధిలోని భక్తుల కోసం ఎస్-3 గేట్ వద్ద ప్రత్యేక ర్యాంప్ ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి వారు నేరుగా ఆర్టీసీ బస్సుల్లో తిరుపతి లేదా తిరుమల బస్టాండ్‌కు చేరుకోవచ్చు.మొత్తం మీద సుమారు 3,000 సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. అలిపిరి టోల్‌గేట్, నడక మార్గాల వద్ద ఫేషియల్ రికగ్నిషన్, ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ కెమెరాలను అమర్చారు.

## నియోజకవర్గాల వారీగా

# 'మూడ్ ఆఫ్ తెలంగాణ'

కేసీఆర్ నివాసంపై కాంగ్రెస్ చేసిన దాడి యత్నంపై ఏమంటున్నారు? అనే ఐదు అంశాలపై నియోజకవర్గాల వారీగా ప్రజల అభిప్రాయాలను నమోదు చేశారు.

**రాష్ట్రస్థాయి ఫలితాలకు మరింత బలం**

ఇప్పటికే వెల్లడైన రాష్ట్రస్థాయి ఫలితాల్లో రేవంత్ పాలన బాగోలేదని, హామీలు అమలు కాలేదని 74.64 శాతం మంది పేర్కొన్న విషయం తెలిసిందే. కేవలం 19.06 శాతం మంది మాత్రమే పాలన బాగుందని, హామీలు అమలు చేశారని చెప్పారు. సీఎం రాజకీయ విధానాలు సరిగా లేవని 71.33 శాతం మంది పేర్కొనగా.. కాంగ్రెస్ నాయకులు కేసీఆర్ మరణాన్ని కోరుకోవడం సరైన పద్ధతి కాదని ఏకంగా 92.87 శాతం మంది అభిప్రాయపడ్డారు.ఇక గత కేసీఆర్-బీఆర్ఎస్ పాలన, ప్రస్తుత రేవంత్‌రెడ్డి-కాంగ్రెస్ పాలనలో ఏది బాగుందని అడిగితే 72.82 శాతం మంది కేసీఆర్ పాలనకే జై కొట్టారు. రేవంత్ పాలన బాగుందని 16.62 శాతం మంది మాత్రమే పేర్కొన్నారు. కేసీఆర్ నివాసంపై దాడి యత్నాన్ని 84.21 శాతం మంది వ్యతిరేకించారు.ఇప్పుడు నియోజకవర్గాల వారీగా వచ్చిన గణాంకాలను పరిశీలిస్తే.. రాష్ట్రస్థాయిలో కనిపించిన ఇదే ధోరణి కేవలం కొన్ని నియోజకవర్గాలకు పరిమితం కాలేదని స్పష్టమవుతున్నది.

**118 నియోజకవర్గాల్లోనూ రేవంత్ పాలనకు ఎదురుదెబ్బ**

'సీఎం రేవంత్‌రెడ్డి పాలన తీరు ఎలా ఉంది? ఎన్నికల హామీలు అమలు చేశారా?' అన్న మొదటి ప్రశ్నకు నియోజకవర్గాల వారీగా వచ్చిన సమాధానాలు కాంగ్రెస్‌కు ఆందోళన కలిగించేలా ఉన్నాయి. 118 నియోజకవర్గాల్లో అన్నిచోట్లా 'పాలన బాగోలేదు.. హామీలు అమలు కాలేదు' అన్న అభిప్రాయమే ఎక్కువగా ఉంది. అత్యధికంగా నాంపల్లి, చార్మినార్‌లో ఏకంగా 100 శాతం మంది రేవంత్ పాలన బాగోలేదని, హామీలు అమలు కాలేదని పేర్కొన్నారు. జుక్కల్‌లో 94.5 శాతం, బాల్కొండలో 93 శాతం, పటాన్‌చెరులో 91.6 శాతం, సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో 91.1 శాతం, మహబూబ్‌నగర్‌లో 90.6 శాతం మంది ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అంటే.. ఏడు నియోజకవర్గాల్లో 90 శాతానికి పైగా ప్రజలు రేవంత్ పాలనపై ప్రతికూల అభిప్రాయం వ్యక్తం చేసినట్టయింది.ఇదే ప్రశ్నలో 80 శాతానికి పైగా వ్యతిరేకత నమోదైన నియోజకవర్గాలు 32 ఉన్నాయి. 70 శాతానికి పైగా ప్రజలు పాలన బాగోలేదని చెప్పిన నియోజకవర్గాల సంఖ్య ఏకంగా 83 ఉన్నాయి. అదిలాబాద్‌లో 87.3 శాతం, గజ్వేల్‌లో 86.8 శాతం, కామారెడ్డిలో 86 శాతం, నాగార్జున సాగర్‌లో 86 శాతం, తాండూరులో 85.1 శాతం, నిజామాబాద్ అర్బన్‌లో 84.3 శాతం, అశ్వారావుపేటలో 84.2 శాతం మంది రేవంత్ పాలనపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మిర్యాలగూడలో 83.7 శాతం, దేవరకద్రలో 83.3 శాతం, జగిత్యాలలో 82.8 శాతం, నర్సంపేటలో 82.7 శాతం, కుత్బుల్లాపూర్‌లో 82.5 శాతం మంది కూడా ఇదే అభిప్రాయాన్ని వెల్లడించారు.

**సీఎం సొంత ఇలాకాలోనూ..**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లోనూ ప్రజల స్పందన కాంగ్రెస్‌కు అనుకూలంగా లేదు. అక్కడ 76 శాతం మంది రేవంత్ పాలన బాగోలేదని పేర్కొన్నారు. రేవంత్ అనుసరిస్తున్న రాజకీయ విధానాలు సరిగా లేవని 68.2 శాతం మంది చెప్పగా.. ప్రస్తుత పాలన కంటే గత కేసీఆర్ పాలనే బాగుందని 64.2 శాతం మంది పేర్కొన్నారు. కేసీఆర్ నివాసంపై దాడి యత్నాన్ని 84.4 శాతం మంది వ్యతిరేకించగా.. కాంగ్రెస్ నేతలు కేసీఆర్ మరణాన్ని కోరుకోవడం సరైన పద్ధతి కాదని ఏకంగా 95 శాతం మంది కొడంగల్ ప్రజలు అభిప్రాయపడ్డారు.

**రాజకీయ విధానాలపైనా తీవ్ర వ్యతిరేకత**

సీఎం రేవంత్‌రెడ్డి అనుసరిస్తున్న రాజకీయ విధానాలపై మీ అభిప్రాయం ఏమిటి?' అన్న రెండో ప్రశ్నకూ దాదాపు ఇదే ఫలితం వచ్చింది. రాష్ట్రస్థాయిలో 71.33 శాతం మంది రేవంత్ రాజకీయ విధానాలు కరెక్ట్ కాదని పేర్కొన్నారు. నియోజకవర్గాల వారీగా చూస్తే 118 నియోజకవర్గాల్లోనూ రేవంత్ రెడ్డి రాజకీయ విధానాలు 'కరెక్ట్ కాదు' అన్న అభిప్రాయమే ఎక్కువగా నమోదైంది. నాంపల్లి, చార్మినార్‌లో 100 శాతం మంది రాజకీయ విధానాలు కరెక్ట్ కాదని పేర్కొన్నారు. బహదూర్‌పురాలో 98.4 శాతం, జుక్కల్‌లో 89 శాతం, గజ్వేల్‌లో 88.7 శాతం, సిద్ధిపేటలో 88.5 శాతం, మల్కాజిగిరిలో 87.7 శాతం మంది రేవంత్ రాజకీయ విధానాలను తప్పుబట్టారు. నిజామాబాద్ అర్బన్‌లో 86.4 శాతం, సత్తుపల్లిలో 86 శాతం, కామారెడ్డిలో 85.6 శాతం, ఆదిలాబాద్‌లో 85.2 శాతం, నాగార్జునసాగర్‌లో 84.7 శాతం, బాల్కొండలో 84.5 శాతం, సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో 84.4 శాతం మంది ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. కేవలం హైదరాబాద్‌లోనే కాదు.. ఉత్తర తెలంగాణ, మధ్య తెలంగాణ, దక్షిణ తెలంగాణ, ఉమ్మడి ఖమ్మం ప్రాంతాల్లోనూ రేవంత్ రాజకీయ విధానాలపై ప్రతికూల స్పందన గణనీయంగా కనిపించింది.స్థానిక సేవలను పొందండి

**కేసీఆర్ మరణాన్ని కోరుకోవడంపై ముక్తకంఠంతో వ్యతిరేకత**

'కాంగ్రెస్ పార్టీ నాయకులు కేసీఆర్ మరణాన్ని కోరుకోవడంపై మీ అభిప్రాయం ఏమిటి?' అన్న మూడో ప్రశ్నకు వచ్చిన అభిప్రాయాలు దాదాపు ఏకపక్షంగా ఉన్నాయి. రాష్ట్రస్థాయిలో ఇప్పటికే 92.87 శాతం మంది ఇది సరైన పద్ధతి కాదని తేల్చి చెప్పారు. నియోజకవర్గాల వారీగా చూస్తే పరిస్థితి మరింత స్పష్టంగా కనిపించింది. 118 నియోజకవర్గాల్లోనూ 'కేసీఆర్ మరణాన్ని కోరుకోవడం సరైన పద్ధతి కాదు' అన్న అభిప్రాయమే అత్యధికంగా నమోదైంది. అంతేకాదు.. 110 చోట్ల 70 శాతానికి పైగా ప్రజలు కాంగ్రెస్ నేతల తీరును తప్పుబట్టారు. ఏకంగా 88 నియోజకవర్గాల్లో 90 శాతానికి పైగా ప్రజలు ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు.కుత్బుల్లాపూర్, నాంపల్లి, చార్మినార్, చంద్రాయణగుట్ట, బహదూర్‌పురా, మహబూబ్‌నగర్‌లో 100 శాతం మంది ఈ విధానాన్ని వ్యతిరేకించారు. పటాన్‌చెరులో 99.6 శాతం, సత్తుపల్లిలో 99.4 శాతం, వరంగల్ ఈస్ట్‌లో 99.2 శాతం, మల్కాజిగిరిలో 99.1 శాతం, కొల్లాపూర్‌లో 99.1 శాతం మంది కాంగ్రెస్ నేతల తీరాన్ని తప్పుబట్టారు. కామారెడ్డిలో 98.7 శాతం, జుక్కల్‌లో 98.3 శాతం, ముషీరాబాద్‌లో 98 శాతం, పాలకుర్తిలో 98 శాతం మంది ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రాజకీయ ప్రత్యర్థిపై విమర్శలు, ఆరోపణలు చేయడం వేరు.. ఆయన మరణాన్ని కోరుకోవడం వేరు అన్న భావన ప్రజల్లో బలంగా ఉందని ఈ ఫలితాలు సూచిస్తున్నాయి.

**కేసీఆర్ పాలనకే 118 నియోజకవర్గాల్లో ఆధిక్యం**

'కేసీఆర్-బీఆర్ఎస్ పాలన బాగుందా? రేవంత్‌రెడ్డి-కాంగ్రెస్ పాలన బాగుందా?' అని ప్రజలను నేరుగా అడిగితే..118 నియోజకవర్గాల్లోనూ కేసీఆర్-బీఆర్ఎస్ పాలనకు వచ్చిన శాతం రేవంత్-కాంగ్రెస్ పాలన కంటే ఎక్కువగా ఉంది. అంటే.. ఒక్క నియోజకవర్గంలో కూడా రేవంత్ పాలనకు కేసీఆర్ పాలనపై ఆధిక్యం కనిపించలేదు.నాంపల్లి, చార్మినార్‌లో 100 శాతం మంది కేసీఆర్ పాలనే బాగుందని పేర్కొన్నారు. జుక్కల్‌లో 95.3 శాతం, సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో 93.3 శాతం, అశ్వారావుపేటలో 89.5 శాతం, పటాన్‌చెరులో 88.8 శాతం, జూబ్లీహిల్స్‌లో 88.7 శాతం, ఆదిలాబాద్‌లో 88.6 శాతం మంది కేసీఆర్ పాలనకు మద్దతు పలికారు. గజ్వేల్‌లో 87.9 శాతం, బాల్కొండలో 87.5 శాతం, సత్తుపల్లిలో 86.6 శాతం, మిర్యాలగూడలో 86.2 శాతం, ఎల్లారెడ్డిలో 85.6 శాతం, కామారెడ్డిలో 85.5 శాతం మంది గత బీఆర్ఎస్ పాలనే బాగుందని చెప్పారు. బాన్సువాడ, ఆలేరు నియోజకవర్గాల్లో 83.4 శాతం, బహదూర్‌పురాలో 82.8 శాతం, నాగార్జునసాగర్‌లో 82.7 శాతం, సిద్ధిపేటలో 82.4 శాతం, ఆసిఫాబాద్‌లో 80.8 శాతం, కొల్లాపూర్‌లో 80.5 శాతం, భూపాలపల్లిలో 80.4 శాతం మంది కేసీఆర్ పాలనకు మద్దతు పలికారు.కేసీఆర్ నివాసంపై దాడి యత్నంపైనా తీవ్ర వ్యతిరేకత'కేసీఆర్ నివాసంపై కాంగ్రెస్ చేసిన దాడి యత్నం మీద మీరేమంటారు?'

edited, Printed, Published and Owned by: Venkateshwarlu Rapolu # Flat No. 202, Nomula Chambers, E-Seva Road, TRT Seetaphalmandi, Sec'bad-61.Telangana. INDIA. www.trinetnews.com, Email: trinetnews2026@gmail.com (Telangana) Editor: Venkateshwarlu Rapolu, +91 98497 67747,9494184136